క్లుప్తంగా

ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రం ప్రారంభం



ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి

జిన్నారం(పటాన్‌చెరు): నిరుపయోగంగా ఉండే వస్తువులను రీయూజ్ రెడ్యూజ్ రీసైక్లింగ్ (ఆర్‌ఆర్‌ఆర్) కేంద్రానికి అందజేయాలని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి అన్నారు. బొల్లారంలోని పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో గురువారం ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపయోగంగా ఉండే వస్తువులు, ప్లాస్టిక్ వస్తువులు, దుస్తులను ట్రిపుల్‌ఆర్ కేంద్రానికి అందజేయడం ద్వారా వాటిని నిరుపేదలు తీసుకెళ్లేందుకు వీలుగా ఉంటుందని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్, ఏఈ వినోద్ పాల్గొన్నారు.

ఫర్టిలైజర్స్ దుకాణాల్లో తనిఖీలు



విత్తన ప్యాకెట్లను పరిశీలిస్తున్న అధికారులు

నారాయణఖేడ్: పట్టణంలోని ఫర్టిలైజర్స్ దుకాణాలతో పాటు అగ్రోస్, గ్రోమోర్ దుకాణాలను వ్యవసాయశాఖ టాస్క్‌ఫోర్స్ టీం అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. ఖేడ్ సబ్‌డివిజన్ టాస్క్‌ఫోర్స్ అధికారిణిగా వ్యవహరిస్తున్న సంగారెడ్డి ఏడీఏ అంబిక, ఎస్‌ఐ రాములు, ఖేడ్ ఇన్‌చార్జి ఏడీఏ శంకర్‌లతో కూడిన టాస్క్‌ఫోర్స్ టీం అధికారులు ఖేడ్‌లోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోడౌన్లలో ఉన్న వివిధ రకాల విత్తన పాకెట్లు, బస్తాలు, వాటిపై ఉన్న వివరాలు, రికార్డులను పరిశీలించారు. ఎవరైనా నకిలీ విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వర్షంతో తడిసిన ధాన్యం



తడిసిన ధాన్యం చూపుతున్న రైతులు

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలంలోని ఖాజాపూర్‌లో బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. రోడ్డుపై ఆరబెట్టిన వరిధాన్యం కుప్పలు పూర్తిగా తడిసిపోయాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీసీసీ ఉపాధ్యక్షుడు, తహసీల్దార్ మెహిక్, కద్లల్ పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి గురువారం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఆందోళన చెందవద్దని తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని డీసీసీ రైతులకు హామీనిచ్చారు. కొనుగోలు సభ్యులు బషీర్, పీఏసీఎస్ సీఈఓ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

నల్లపోచమ్మతల్లికి పూజలు

హత్నూర (సంగారెడ్డి): మండల పరిధిలోని నస్తీపూర్ గ్రామ శివారులోని నల్లపోచమ్మ ఆలయంలో గురువారం రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి, ఎంఎల్‌ఏ మదన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ అధ్యక్షులు వావిలాల నర్సింలు, ఎంపీటీసీ కిషన్‌రావు, సర్పంచ్ కవితావెంకటగిరి, ఎస్‌ఎంసీ చైర్మన్ సుధాకర్, సదానందం పాల్గొన్నారు.

నేడు హెల్మెట్ వాడకంపై ర్యాలీ

సంగారెడ్డి మున్సిపాలిటీ: సంగారెడ్డి జిల్లా పోలీస్, హోప్ న్యూరో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సంయుక్తంగా వాహనదారులకు హెల్మెట్ వాడకంపై శుక్రవారం అవగాహన కల్పించనున్నట్లు గురువారం డాక్టర్ కృష్ణమూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 7 గంటలకు జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుంచి బైక్ ర్యాలీతో ప్రారంభమై 9 గంటలకు దొడ్డి కొమురయ్య విగ్రహం వద్ద జరిగే బహిరంగ సభతో ముగుస్తుందన్నారు. హెల్మెట్ ధరించకపోవడం ద్వారా జరిగే రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించేందుకు హెల్మెట్ రైడ్ పేరుతో ఈవెంట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్‌కు ఎస్పీ రమణకుమార్, డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ప్రముఖ వక్తలు పాల్గొంటారన్నారు.

ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న మున్సిపల్ కమిషనర్

జహీరాబాద్: సీఎం కప్ టోర్నమెంట్‌లో జహీరాబాద్ మున్సిపాలిటీకి చెందిన ఫుట్‌బాల్ జట్టు విన్నర్‌గా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. గురువారం సంగారెడ్డిలో జరిగిన ఫైనల్ పోటీల్లో జహీరాబాద్ జట్టు విన్నర్‌గా నిలిచింది. ఈ నెల 27వ తేదీన హైదరాబాద్‌లో ఎల్‌బీ స్టేడియంలో జరగనున్న సీఎం రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించింది. విన్నర్‌గా నిలిచిన జట్టుకు జహీరాబాద్‌లోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో కమిషనర్ మల్లారెడ్డి క్రీడాకారులను అభినందించారు.

జనాభా ఎక్కువ.. కేంద్రాలు తక్కువ

- రోజురోజుకు పెరుగుతున్న కాలనీలు
- అధికమవుతున్న వలస కుటుంబాల సంఖ్య
- అదనంగా అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని విన్నపం



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు



ఖాజీపల్లి అంగన్‌వాడీ కేంద్రం

పటాన్‌చెరు: నియోజకవర్గపరిధిలో జనాభాకనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. రోజురోజుకు పటాన్‌చెరు పట్టణం అభివృద్ధి చెందుతుండటంతో అన్ని గ్రామాలు పట్టణ ప్రాంతాలుగా మారి నూతన కాలనీలు ఏర్పడ్డాయి. గతంలో ఆయా పరిశ్రమల్లో పనిచేసే కార్మిక కుటుంబాలు మాత్రమే వలస వచ్చి ఇక్కడ స్థిరపడ్డారు. ప్రస్తుతం బీహార్, ఛత్తీస్‌గఢ్ ఇతర అనేక ప్రాంతాల నుంచి వలస కూలీలు, మేస్త్రీలు నిర్మాణ రంగంలో పనిచేసేందుకు రావడంతో వారి కుటుంబాల సంఖ్య విపరీతంగా పెరిగింది. కొన్నిచోట్ల ఇప్పుడున్న జనాభాకే సేవలందుతాయని, కొత్తవారిని అంగన్‌వాడీ కేంద్రాలకు రానివ్వని పరిస్థితి నెలకొంది.

అదనంగా ఏర్పాటు చేయాలని..

ఇదివరకు లక్డారం చౌరస్తాలో వలస కార్మికులకు ప్రత్యేకంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇటువంటి కేంద్రాలు మరిన్నింటిని ఏర్పాటు చేయాలనే డిమాండ్ పెరిగింది. అమీన్‌పూర్, బొల్లారం, తెల్లాపూర్ పట్టణాల్లో నూతనంగా వందలాది కాలనీలు పెరగడంతో ప్రస్తుత పరిస్థితుల ప్రకారం ఇప్పుడున్న అంగన్‌వాడీ కేంద్రాలకు రెండింతలు పెంచాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది.

అంగన్‌వాడీ కేంద్రాలు, లబ్ధిదారుల వివరాలు	
అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య:	165
గర్భిణులు:	2,353
బాలింతలు:	1,952
ఏడు నెలల నుంచి మూడేళ్ల పిల్లలు:	12,403
ప్రీస్కూల్ (3-6)లో ఉన్న చిన్నారులు:	4,974

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



జనాభాకనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాలు లేకపోవడంతో వలస కార్మిక కుటుంబాలకు పౌష్టికాహారం అందడంలేదు. దీంతో నా వార్డు పరిధిలోని బైలర్స్ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని చాలా కాలంగా కోరుతున్నాం. ఇప్పుడున్న లింగయ్య కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రానికి ఈ ప్రాంతవాసులు వెళ్లాలని చెబుతుండటంతో అక్కడికి వెళ్లేందుకు బాలింతలు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.
– మున్నా, కౌన్సిలర్, అమీన్‌పూర్

మినీ అంగన్‌వాడీల సంఖ్య పెరగాలి



అమీన్‌పూర్ పట్టణం రోజురోజుకు విస్తరిస్తుండటంతో నూతనంగా కాలనీలు పుట్టుకొస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి జనాభాకనుగుణంగా మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసి అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.
– నాయిని నర్సింహారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు

ప్రతిపాదనలు పంపాం

పటాన్‌చెరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో కొత్తగా 34 కొత్త కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నూతనంగా ఏర్పడిన కాలనీల్లో అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని వివిధ కాలనీవాసులు చాలా కాలంగా కోరుతున్నారు. నివేదిక రాగానే అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేస్తాం. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నాం.
– చంద్రకళ, సీడీపీఓ, ఐసీడీఎస్, పటాన్‌చెరు ప్రాజెక్టు

సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య

ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



జ్ఞాపికలు అందజేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివి టెన్త్‌లో 10 జీపీఏ సాధించిన విద్యార్థిని విద్యార్థులతో పాటు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలను అభినందిస్తూ క్యాంపు కార్యాలయంలో గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా 10 జీపీఏ సాధిస్తున్న విద్యార్థుల సంఖ్య పెరుగుతుండటం శుభపరిణామం అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్, వైస్ చైర్మన్ పరశురాం, జెడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్, రమేష్ చౌహాన్, ఎంఈఓలు పాల్గొన్నారు. అనంతరం ఖేడ్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని కందుకూరుకు సూపర్ లగ్జరీ బస్సు సర్వీసును రాజీవ్‌చౌక్‌లో ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం మల్లేశయ్య, డిప్యూటీ ట్రాఫిక్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, మార్కెటింగ్ సెల్ ఇన్‌చార్జి పాండు, రవీందర్ నాయక్, రమేష్ చౌహాన్, సంజీవరావు పాల్గొన్నారు. జీపీఎస్‌ల ఉద్యోగాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం నిర్ణయించడాన్ని పురస్కరించుకొని క్యాంపు కార్యాలయంలో జీపీఎస్‌లు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డితో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

సాయిబాబా ఆలయంలో పూజలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని ఇబ్రహీంబాద్ శివారులోని సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సమయంలోనే స్వామివారికి అభిషేకాలు, అర్చనలు తదితర పూజా కైంకర్యాలు చేపట్టారు. ఆదివారం స్వామివారికి ప్రత్యేక అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు చర్యలు తీసుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోదారి రాములు, ఆలయ కమిటీ సభ్యులు, వివిధ గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పేదలకు వరం.. సీఎం రిలీఫ్ ఫండ్

ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

వట్‌పల్లి(అందోల్): సీఎం రిలీఫ్‌ఫండ్ నిరుపేదలకు వరమని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. టేక్మాల్ మండలంలోని బొడ్మట్‌పల్లి గ్రామానికి చెందిన కోడపాక కిషన్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా మంజూరైన రూ.2లక్షల చెక్కును బాధితుడి తల్లి పెంటమ్మకు గురువారం ఎమ్మెల్యే తన నివాసంలో అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ టేక్మాల్ మండల ప్రధాన కార్యదర్శి అవినాష్‌కుమార్, నాయకులు ఈశ్వరప్ప, రాజేష్‌గౌడ్, విఠల్, కాపోర్దీన్, రవి, శంకర్, నాగరాజు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

కొండాపూర్(సంగారెడ్డి): బీజేపీ ఐక్యతను దెబ్బతీస్తూ పార్టీకి నష్టం చేసేందుకు బీఆర్‌ఎస్ కొత్తదారులు వెతుకుతోందని, వాటిని లెక్క చేయకుండా బీజేపీ కార్యకర్తలు అధికారమే లక్ష్యంగా ముందుకు సాగాలని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని మల్కాపూర్‌లో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు సాయికుమార్, నాయకులు వేణుమాధవ్, ఎల్లయ్య, మల్లేశం పాల్గొన్నారు.

సంగారెడ్డిటౌన్: సంగారెడ్డి పట్టణంలోని ఓ హోటల్‌లో బీజేపీ పట్టణ అధ్యక్షుడు రవిశంకర్ అధ్యక్షతన పట్టణ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర నాయకులు శివరాజ్ పాటిల్ మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ అధ్యక్షులు సీనియర్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు కొండాపురం జగన్, అసెంబ్లీ కో–కన్వీనర్ నూర్ సత్య నారాయణ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

'ప్రజాగర్జన' కరపత్రం విడుదల



కరపత్రాన్ని విడుదల చేస్తున్న నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): వచ్చే నెల జూన్ 6న కొత్తగూడెంలో నిర్వహించనున్న సీపీఐ ప్రజాగర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహబూబ్‌ఖాన్ అన్నారు. గురువారం సంగారెడ్డి పట్టణ కార్యాలయంలో ప్రజాగర్జన సభ కరపత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు నర్సింలు, అనురాధ నాయకులు శశికళ, రాములు, పావని పాల్గొన్నారు.

హానర్ పరిశ్రమ సహకారం అభినందనీయం



వైకుంఠ రథాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

హత్నూర(సంగారెడ్డి): హానర్ పరిశ్రమ ముందుకొచ్చి వైకుంఠరథాలను పంపిణీ చేయడం అభినందనీయమని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. గురువారం హత్నూర మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో హానర్ పరిశ్రమ సహకారంతో తయారుచేసిన వైకుంఠరథాలను ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సిరిపురం, సికింద్రాపూర్ గ్రామాల ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధితో పాటు శ్మశానవాటికల నిర్మాణాలకు ప్రాధాన్యత కల్పిస్తోందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సింలు, పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, హానర్ పరిశ్రమ హెచ్‌ఆర్ మేనేజర్ సుభాష్‌రెడ్డి, హెచ్‌ఆర్ వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, యువత మండల అధ్యక్షులు కిషోర్, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

రైతులపై చిన్నచూపు తగదు

జహీరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం రైతులను చిన్నచూపు చూస్తోందని నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు నరోత్తం ఆరోపించారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జహీరాబాద్ ప్రాంత చెరకు రైతులకు బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కర్మాగారంలో చక్కెర నిల్వలు తక్కువగా ఉన్నాయని, డబ్బు ఎలా చెల్లిస్తుందనే అనుమానం రైతులు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోనే జహీరాబాద్ ప్రాంతంలో రైతులు పంటలను పూర్తిగా కోల్పోయి నష్టాల పాలయ్యారన్నారు. ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకుంటామని చెప్పి నేటికీ ఎలాంటి పరిహారం అందించలేదని విమర్శించారు. ఇప్పటి హామీలను నిలుపుకుని రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మల్లాని, నాగిరెడ్డి, మైనొద్దీన్, శంకర్, యూసుఫ్, మోహనరెడ్డి, షరీఫ్, శ్రీకాంత్, షాహీద్‌పటేల్ పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర చేనేత సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. మండల పరిధిలోని నందికంది పీఏసీఎస్ ఆధ్వర్యంలో గురువారం రైతులకు సబ్సిడీపై జనుము, జీలుగ విత్తనాల బస్తాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ బుచ్చిరెడ్డి, ఏడీఏ మనోహర్, ఎంపీపీ తొంట యాదమ్మశ్రీశైలం, పీఏసీఎస్ చైర్మన్లు మనోహర్‌రెడ్డి, రత్నాకర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చింతా ప్రభాకర్‌పై ఆరోపణలు చేస్తే సహించం

సంగారెడ్డి మున్సిపాలిటీ: కాంగ్రెస్ నేత చింతా ప్రభాకర్‌పై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ నేతలు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం సంగారెడ్డిలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చింతా ప్రభాకర్ ఎన్నికల్లో ఓడిపోయినా అనునిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యలు తెలుసుకుంటున్నారన్నారు. గెలిచిన ఎమ్మెల్యే హైదరాబాద్‌లో పరిమితమైతే ఓడిన చింతా ప్రభాకర్ ప్రజల సంక్షేమం కోసం ప్రజల మధ్య ఉంటున్నారని తెలిపారు. ప్రత్యేక నిధులతో పార్టీలకు అతీతంగా అన్ని వార్డుల్లో అభివృద్ధి జరగాలని నిధులు కేటాయిస్తే అసహనానికి గురయ్యే సోషల్ మీడియా మంచికాదన్నారు. ఇప్పటికైనా చింతా ప్రభాకర్‌పై ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి నర్సింలు, నాయకులు అంజద్అలీ, కౌన్సిలర్ సమీ పాల్గొన్నారు.

వానప్రస్థ ఆశ్రమానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

ఝరాసంగం(జహీరాబాద్): జిల్లాలో ఆధ్యాత్మిక క్షేత్రమైన బర్దిపూర్ దత్తగిరి ఆశ్రమ ఆవరణలో నిర్మించే వానప్రస్థ ఆశ్రమానికి గురువారం రాత్రి శంకుస్థాపన చేశారు. ఆశ్రమ పీఠాధిపతులు 108 వైరాగ్య శిఖామణి అవధూతగిరి మహారాజ్, డాక్టర్ సిద్ధేశ్వరస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారికి పూర్ణకుంభంతో ఆశ్రమ స్వాగతం పలికారు. అనంతరం ఆశ్రమ నిర్మాణానికి మంత్రి హరీశ్‌రావు అందజేసిన రూ.5లక్షల విరాళాన్ని ట్రస్టు చైర్మన్‌కు అందజేశారు. కార్యక్రమంలో దత్తగిరి ఆశ్రమ ట్రస్టు చైర్మన్ అల్లాడి వీరేశం, గ్రామపెద్దలు క్రిష్ణ, అర్చకులు, వైదిక పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలి

సంగారెడ్డి టౌన్: రోడ్డు రవాణా సంస్థ దయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా నుంచి డి మంది స్పందన వచ్చింది. శంకర్‌పేట్ నుంచి రమేష్, విశ్వనాథ్ మాట్లాడుతూ జోగిపేట నుంచి సంగారెడ్డి వచ్చే బస్సులు సర్వీస్ రోడ్ మీదుగా నడపాలన్నారు, వికారాబాద్ నుంచి దేవేందర్ మాట్లాడుతూ సంగారెడ్డి శంకరపల్లి మీదుగా వికారాబాద్ మీదుగా బస్సులను నడపాలని కోరారు. పిట్లాడుల్పెంటికి ఆరోఎం స్పందిస్తూ వీటికి త్వరలోనే ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. సంగారెడ్డి నుంచి కామారెడ్డికి మెదక్ రామాయంపేట వయా కామారెడ్డికి ప్రతి రోజు ఉదయం 8.30కి బస్సు ఉంటుందన్నారు.



సంగారెడ్డి అర్బన్: పట్టణంలో ప్రధాన రహదారిపై ఐబీ కూడలి నుంచి కలెక్టరేట్ వైపుగా సెంట్రల్ లైటింగ్ వెలగడం లేదు అనే అంశంపై ఈ నెల 24న 'సాక్షి' దినపత్రికలో 'వెలగని సెంట్రల్ లైటింగ్' అనే శీర్షికతో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యటించే ఈ రహదారిపై సెంట్రల్ లైటింగ్ వెలగకపోవడంతో ఈ సమస్యను సాక్షి వెలుగులోకి తెచ్చిన వార్తను ప్రచురించడంతో అధికారులు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

ఆర్థికసాయం అందజేత

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని నల్లవల్లి గ్రామానికి చెందిన యూసుఫ్‌ఖాన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి రూ.10వేల ఆర్థికసాయాన్ని ప్రకటించారు. ఈ నగదును ఎమ్మెల్యే కుమారుడు విక్రంరెడ్డి మృతుడి కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు హుస్సేన్, ఫయాజ్, షరుద్దీన్ పాల్గొన్నారు.

దివ్యాంగుల మేళాకు స్పందన

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని క్యాంప్‌లో గురువారం నిర్వహించిన దివ్యాంగుల బస్‌పాస్ మేళాకు స్పందన వచ్చినట్లు ఎటీఎం బస్‌పాస్ నిర్వాహకులు మహేశ్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు 50 మంది దివ్యాంగులకు బస్‌పాసులు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ సీఐ ప్రశాంత్‌కుమార్, సిబ్బంది మధు, మహేశ్‌గౌడ్, రమేశ్, నర్సింహ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నూతన కార్యవర్గానికి సన్మానం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రానున్న ఎన్నికల్లో పటాన్‌చెరు నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం పట్టణంలోని ఆయన నివాసంలో తెల్లాపూర్ మున్సిపాలిటీ నూతన కాంగ్రెస్ కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షులు దేవేందర్, కౌన్సిలర్ పావని, నాయకులు శ్యాంరావు, రమేష్ పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలను అభివృద్ధి చేస్తామని కార్పొరేటర్ పుష్పనగేష్ తెలిపారు. గురువారం పట్టణంలోని కాకతీయనగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీలలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి నాయకులు బూరుగడ్డ నగేష్, సుధాకర్‌రెడ్డి, నరేంద్రబాబు, మల్లేష్, శంకర్‌రెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్ల కేంద్రం సందర్శన

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఆర్‌డీవో డీఎం రవీందర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేకరించిన ధాన్యానికి సత్వరమే మిల్లులకు తరలించాలన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలి

పటాన్‌చెరు టౌన్: ఒక సామాజికవర్గాన్ని అవమానపరిచేలా వ్యాఖ్యలు చేసిన టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వెంటనే మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, యాదవ సంఘాలకు క్షమాపణలు చెప్పాలని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. గురువారం మెట్టు కుమార్‌యాదవ్, 112 డివిజన్ కార్పొరేటర్ పుష్పనగేష్ యాదవ్, ఎంకేవై యువసేన సభ్యులతో హైదరాబాద్ బ్యాంక్ బండ్ వద్ద గల పార్క్ వద్ద తెలంగాణ యాదవ సంఘం సమావేశం ఏర్పాటు చేసిన నిరసన ర్యాలీకి తరలివెళ్లారు. ఈ సందర్భంగా కుమార్‌యాదవ్ మాట్లాడుతూ నాగరిక సరిగా తెలియని రోజుల్లోనే యాదవులు పాల వ్యాపారం, వ్యవసాయం చేసి నాగరికతను సమాజానికి తెలియపరచారన్నారు. అటువంటి యాదవులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆదుగుజాడల్లో నడవాలి

సంగారెడ్డి టౌన్: ప్రతిఒక్కరూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్ అన్నారు. గురువారం రాత్రి కులబూర్ లోని జీఈఫ్ట్ గార్డెన్‌లో అంబేడ్కర్ జీవిత చరిత్రపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ గర్భాలో నాటకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో స్థానిక కేవీపీఎస్ నాయకులు, వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

సంగారెడ్డి మున్సిపాలిటీ: మున్సిపల్ కార్యాలయంలో జరిగిన గొడవలో కాంగ్రెస్ కౌన్సిలర్ షేక్‌షఫీపై బీఆర్‌ఎస్ కౌన్సిలర్ పెట్టిన అక్రమ కేసుకు నిరసనగా గురువారం నాయకులు నిరసన తెలిపారు. నగర నాయకులు గురువారం సంగారెడ్డి పట్టణంలో ఆందోళన చేసి గురువారం చింతా ప్రభాకర్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

ఘనంగా సుబ్రమణ్యస్వామి షష్టి వేడుకలు

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి పట్టణంలోని సుబ్రమణ్యస్వామి దేవాలయంలో షష్టి వేడుకలను గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు సుబ్రమణ్యస్వామికి అభిషేకం నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

స్వర్ణామృత ప్రాశన మందు

జహీరాబాద్: పట్టణంలో వికాస తరంగిణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 16 సంవత్సరాల లోపు పిల్లలకు స్వర్ణామృత చుక్కల మందు వేశారు. గురువారం దత్తసాయి క్లినిక్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రెండు చుక్కల మేర మందు వేశారు. ఈ మందు ప్రాధాన్యత గురించి సభ్యులు వివరించారు.

నేడు బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం

వట్‌పల్లి(అందోల్): వట్‌పల్లిలోని వెంకటభ్యాజా ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అధ్యక్షతన బీఆర్‌ఎస్ మండల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శివాజీరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

నారాయణఖేడ్: పట్టణంలోని శ్రీశాహీ విశ్వనాథ స్వామి మందిరానికి నూతన పాలకవర్గ మండలి ఏర్పాటుకు దేవాదాయ, ధర్మాదాయశాఖ ఇన్‌ఛార్జ్ వరకు ఉత్తర్వులు జారీ చేశారని ఆలయ కార్యనిర్వాహణ అధికారి మోహన్‌రెడ్డి తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 20 రోజుల్లోగా తమ దరఖాస్తులను హైదరాబాద్ బొగ్గులకుంటలోని దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ కార్యాలయం, లేదా సంగారెడ్డిలోని సహాయ కమిషనర్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. పూర్తి వివరాలకు సంగారెడ్డిలోని సహాయ కమిషనర్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

నేడు దయల్ యువర్ డీఎం

నారాయణఖేడ్: ఆర్టీసీ డిపోలో ఈ నెల 26న శుక్రవారం ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు దయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఎం మల్లేశయ్య తెలిపారు. ఖేడ్‌తో పాటు చుట్టు పక్కల ప్రాంతాల వారు ఆర్టీసీకి సంబంధించిన సమస్యలు, మరింత మెరుగైన సేవలు అందించడానికి తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి 9440149896 నెంబరుకు ఫోన్‌చేసి సూచనలు, సలహాలు ఇవ్వవచ్చని సూచించారు.

సన్మానం

న్యాల్‌కల్(జహీరాబాద్): టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను న్యాల్‌కల్ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. హత్నూర గ్రామంలో గురువారం జరిగిన ఓ శుభకార్యానికి ఎర్రోళ్ల శ్రీనివాస్ నాయకులతో కలిసి హాజరయ్యారు. అనంతరం ముంగి గ్రామం వద్ద న్యాల్‌కల్ మండల నాయకులు నర్సింహారెడ్డి, రవి ద్రప్ప, గొర్లప్ప, రఫీయొద్దీన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌తో టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ మైనార్టీ సభ్యుడు తన్వీర్‌ను సన్మానించారు.

వైకుంఠపురంలో పల్లకీసేవ

సంగారెడ్డి టౌన్: పట్టణ శివారులోని వైకుంఠపురంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేంకటేశ్వరస్వామి పల్లకి సేవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో జరిపించారు.

లక్ష్మీనారాయణ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని మారేపల్లిలో లక్ష్మీనారాయణస్వామి 6వ వార్షికోత్సవ ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భక్తులు ఉత్సవ విగ్రహాలను రథంపై ఊరేగింపు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

రాయితీపై జీలుగ విత్తనాలు

పుల్కల్(అందోల్): రాయితీపై అందజేసే జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారి చైతన్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అగ్రోస్, పీఏసీఎస్ కేంద్రాలలో అందుబాటులో ఉన్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జీలుగ విత్తనాల 30 కేజీల సంచికి రూ.850 ఉంటుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.